సాక్షి
అనంతపురం
బుధవారం। 12। జూన్। 2024



చీనీ టన్ను రూ.39 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి.



జీజీహెచ్‌లో చిన్నారుల సర్జరీలు
అనంతపురం సర్వజనాస్పత్రిలో చిన్నపిల్లల సర్జరీ సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి.
8లో

గరిష్టం/కనిష్టం
34.1°/23.4°
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జెడ్పీలో ఇద్దరి డిప్యుటేషన్ల రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- మళ్లీ 'డిప్యూటీ' పగ్గాలు లలితకు..



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్‌లో ఇద్దరు ముఖ్య అధికారుల డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఇన్‌చార్జ్ డిప్యూటీ సీఈఓగా పని చేసిన రమణారెడ్డి డిప్యుటేషన్ రద్దు కాగా, గుంతకల్లు డీఎల్‌డీఓగా వ్యవహరించిన లలితాబాయి డిప్యుటేషన్ కూడా రద్దయింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే రమణారెడ్డి సెలవులో వెళ్లిపోగా, లలితాబాయి డిప్యూటీ సీఈఓ పగ్గాలు చేపట్టనున్నారు.

లలితాబాయిపై గతంలో తిరుగుబాటు..
జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పని చేసిన లలితాబాయిని బదిలీ చేసే వరకు తాము స్థాయీ సంఘాలతో పాటు సర్వ సభ్య సమావేశాలకు వచ్చేది లేదని జెడ్పీ పాలకవర్గ సభ్యులంతా గతంలో నిరసన తెలిపారు. సమావేశాలను మూకుమ్మడిగా బహిష్కరించారు. దీంతో అప్పటి నుంచి స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించలేదు. ఈ క్రమంలో లలితాబాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో డ్వామాలో పని చేస్తున్న రమణారెడ్డిని నియమించారు. అయితే లలితాబాయి గుంతకల్లుకు వెళ్లకుండా జెడ్పీలోనే తిష్ట వేశారు. ఈ అంశానికి సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి పాలకవర్గ సభ్యులు ఫిర్యాదులు కూడా పంపారు. ఎన్నికల కోడ్ సాకుతో ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

కోడ్ ముగియడంతో..
తమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని అటు రమణారెడ్డి, ఇటు లలితాబాయి ఇద్దరూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించుకున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టర్ ఇప్పుడు వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమణారెడ్డిని డిప్యూటీ సీఈఓగా రిలీవ్ చేయాలని సీఈఓ వైఖోమ్ నిదియాదేవికి సూచించారు. అయితే, డిప్యూటీ సీఈఓగా లలితాబాయి బాధ్యతలు చేపట్టాక స్థాయీ సంఘాలు, జెడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తే.. సభ్యులు హాజరవుతారా? అనే అంశం ఇప్పుడు జెడ్పీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

17,18 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన!

- గత రబీలో నెలకొన్న కరువు స్థితిగతుల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో గత రబీలో నెలకొన్న కరువు పరిస్థితుల పరిశీలనకు త్వరలో కేంద్ర బృందం రానుంది. ఈనెల 17,18 తేదీల్లో జిల్లాలో పర్యటించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.వర్షాభావం వల్ల గత రబీలో రూ. 36.86 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గత ప్రభుత్వం జిల్లాలో 14 మండలాలను కరువు జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే. బెళుగుప్ప, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాల్లో 37,195 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అత్యధికంగా పప్పుశనగ 34,303 హెక్టార్లలో దెబ్బతినడంతో రైతులకు రూ. 34.30 కోట్ల నష్టం వాటిల్లినట్లు నివేదించారు. మినుము, అలసంద, పెసర, ఉలవ, జొన్న, కొర్ర, కుసుమ, పొద్దుతిరుగుడు పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ క్రమంలో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించనుంది.

ప్రతి నెలా స్టాక్ వివరాలు పంపండి : డీఏఓ



ఎరువుల నిల్వలపై ఆరా తీస్తున్న డీఏఓ

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్ వద్ద ఉన్న భాస్కర్ ఎరువుల తయారీ కేంద్రంలో ప్రతి నెలా స్టాక్ వివరాల నివేదికను తప్పనిసరిగా అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం ఆమె భాస్కర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. లైసెన్స్, ముడి సరుకు రికార్డులు, స్టాక్, సేల్స్ రికార్డులు, ల్యాబ్, గోదాంలో నిల్వలను తనిఖీ చేశారు. ఆమె వెంట గుత్తి ఏడీఏ వెంకటరాముడు, టెక్నికల్ ఏఓ బాలానాయక్, ఏఓ అన్వేష్ కుమార్ ఉన్నారు.

ఖరీఫ్ హోరు.. వజ్రకరూరు జోరు

- మండలంలో అత్యధికంగా 19,289 హెక్టార్ల పంటల విస్తీర్ణం అంచనా
- పెద్దవడుగూరు, కళ్యాణదుర్గం, గుంతకల్లులో కూడా సాగు ఎక్కువే
- పెద్దపప్పూరు, యల్లనూరు, పుట్లూరులో తక్కువగా సాగు విస్తీర్ణం



అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ఖరీఫ్ మొదలైంది. మే చివరి వారంలోనే తొలకర్లు పలకరించాయి. జూన్ 2న ప్రవేశించిన నైరుతి కూడా బాగా ప్రభావం చూపిస్తోంది. ప్రభుత్వం రాయితీతో విత్తన వేరుశనగ, కందులు తదితర విత్తనాలు అందిస్తోంది. విత్తనాలు విత్తుకునేందుకు ఈనెల 15 నుంచి జూలై ఆఖరు వరకు మంచి సమయమని శాస్త్రవేత్తలు ప్రకటించారు. దీంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధంగా ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తారని అధికారికంగా అంచనా వేశారు. అందులో వర్షాధారంగా 3.10 లక్షల హెక్టార్లు కాగా మిగతా విస్తీర్ణం నీటి వసతి కింద సాగు చేస్తారని అంచనాలు వేశారు.

సాగులో వజ్రకరూరు టాప్..
ఈ ఖరీఫ్‌లో వజ్రకరూరు మండలంలో అన్ని పంటలు కలిపి అత్యధికంగా 19,289 హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి రానున్నాయని అంచనా వేశారు. ఆ తర్వాత పెద్దవడుగూరు, కళ్యాణదుర్గం, గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి మండలాల్లో 15 వేల హెక్టార్లకు పైబడి విస్తీర్ణం సాగు చేయనున్నారు. తక్కువగా పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, నార్పల, గార్లదిన్నె మండలాల్లో 4 నుంచి 6 వేల హెక్టార్లలో సాగవనుంది. ఈ మండలాల్లో చీనీ, అరటి లాంటి ఉద్యాన పంటల విస్తీర్ణం అధికంగా ఉన్నందున వర్షాధార పంటల సాగు తక్కువగానే ఉండనుంది.

- వేరుశనగ సాగులో 13,928 హెక్టార్లతో రాయదుర్గం అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత గుంతకల్లు, వజ్రకరూరు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో 10 వేల హెక్టార్లకు పైబడి అంచనా వేశారు. కూడేరు, కుందుర్పి, శెట్టూరు, గుత్తి మండలాల్లోనూ వేరుశనగ అధికంగా సాగయ్యే అవకాశం ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.
- కంది పంట వేసే మండలాల్లో 5,546 హెక్టార్లతో వజ్రకరూరు మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ, అనంతపురం, విడపనకల్లు, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు.
- పత్తి విషయానికి వస్తే 15,683 హెక్టార్ల విస్తీర్ణంతో పెద్దవడుగూరు మండలం ముందు వరుసలో నిలుస్తోంది. రెండో స్థానంలో 4,800 హెక్టార్లతో యల్లనూరు ఉండగా.. ఆ తర్వాత డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, విడపనకల్లు, గుత్తి, తాడిపత్రి, శింగనమల, పుట్లూరు, పెద్దపప్పూరు మండలాల్లో ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది.
- ఆముదం సాగులో 2,729 హెక్టార్లతో కళ్యాణదుర్గం మండలం మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత బెళుగుప్ప, ఆత్మకూరు, కూడేరు, కంబదూరు, గార్లదిన్నె, ఉరవకొండ, వజ్రకరూరు, గుంతకల్లు, రాయదుర్గం, డీ.హీరేహాళ్ మండలాల్లో ఆముదం సాగులోకి రానుందని అంచనా వేశారు.
- నీటి వసతి కింద కణేకల్లు మండలంలో అత్యధికంగా వరి సాగు 4,999 హెక్టార్లలో ఉండగా, ఆ తర్వాత బొమ్మనహాళ్, గార్లదిన్నె, శింగనమల, పామిడి, డి.హీరేహాల్, విడపనకల్లు గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, కూడేరు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, యల్లనూరు మండలాల్లో వరి సాగు అధికంగా ఉంటుందని అంచనా వేశారు.
- మొక్కజొన్న డి.హీరేహాళ్, కణేకల్లు, రాయదుర్గం, బొమ్మనహాళ్, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, బెళుగుప్ప, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు, శెట్టూరు, రాప్తాడు, బెళుగుప్ప మండలాల్లో ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది.
- సోయాబీన్‌ను పుట్లూరు, యల్లనూరు మండలాల్లో సాగు చేయనున్నారు. డి.హీరేహాళ్, కణేకల్లు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, ఉరవకొండ మండలాల్లో పొద్దుతిరుగుడు పంట వేస్తారు. బెళుగుప్ప, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రిలో మినుము పంట, పామిడి, వజ్రకరూరు, బ్రహ్మసముద్రం, ఉరవకొండ, శింగనమల, నార్పల, బుక్కరాయసముద్రం, కంబదూరు మండలాల్లో పెసర పంట వేయనున్నారు. డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, గుంతకల్లు, తాడిపత్రి, యాడికి, ఆత్మకూరు, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు,నార్పల,అనంతపురం, రాప్తాడు, కంబదూరు, కుందుర్పి మండలాల్లో కొర్ర పంట సాగు చేస్తారని అంచనా వేశారు. అలాగే తాడిపత్రి,పెద్దపప్పూరు, పామిడి,కంబదూరు, వజ్రకరూరు, ఆత్మకూరు, కూడేరు, కంబదూరు, గార్లదిన్నె, పుట్లూరు, నార్పల, శింగనమల, బుక్కరాయసముద్రం, అనంతపురం మండలాల్లో జొన్న పంట సాగు చేయనున్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్, గుంతకల్లు, గుత్తి, గుమ్మఘట్ట మండలాల్లో సజ్జ పంట ఎక్కువగా సాగు చేయనున్నట్లు అంచనా వేశారు.

జిల్లా అంతటా వాన



రాప్తాడు పండమేరు వంకలో పారుతున్న వాన నీరు

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు 29 మండలాల పరిధిలో 10.5 మి.మీ సగటు నమోదైంది. ఉరవకొండ మండలంలో 29.6 మి.మీ, పామిడి 20.4 మి.మీ, వజ్రకరూరు 20.2 మి.మీ, గార్లదిన్నె 20 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, పెద్దవడుగూరు, శింగనమల, గుంతకల్లు, యాడికి, పుట్లూరు, యల్లనూరు, గుత్తి, రాయదుర్గం,అనంతపురం, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, నార్పల తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటికే 100 మి.మీ పైబడి వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

వర్షసూచన
రాగల మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపిస్తుండటంతో అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, అలాగే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం నమోదు కావచ్చని వారు పేర్కొన్నారు.

హరిత 'అనంత'గా మార్చడమే లక్ష్యం




మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, హాజరైన జిల్లాధికారులు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'జిల్లాలో మొక్కల పెంపకం ఉద్యమంలా సాగాలి. హరిత 'అనంత'గా మార్చడమే లక్ష్యం కావాలి. ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాముల్ని చేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎఫ్‌ఓ, సోషల్ ఫారెస్ట్, సంక్షేమ శాఖలు, ఐసీడీఎస్, డీఈఓ, డ్వామా తదితర శాఖలు తమ పరిధిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో పచ్చదనం సంతరించుకునేలా మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. 30 రకాల మొక్కలను నాటడంపై దృష్టి పెట్టాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలను, స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయాలని చెప్పారు. ముందుగా ఏ వీధిలో ఏ రకమైన చెట్లు నాటాలనేది గుర్తించాలన్నారు. ప్రతి మూడు మీటర్లకు ఒక చెట్టు ఉండేలా చూడాలన్నారు. నాటిన మొక్కలను తుంచేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో అశోక్‌నగర్, రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు, ఆర్‌టీఓ కార్యాలయం రోడ్డు, గౌరవగార్డెన్స్, తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటి, ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొక్కల సంరక్షణకు వార్డు స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇంటి వద్దకు వెళ్లి మొక్కలు నాటేప్పుడు ఆ ఇంటి వారితో ప్రమాణం తీసుకోవాలని చెప్పారు. విద్య, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యాసంస్థల్లోనూ విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. మొక్కలు ఎక్కువగా నాటిన వారికి అవార్డు ఇస్తామన్నారు. కలెక్టరేట్ ఆవరణలోనూ మొక్కలు పెంచాలని, ఒక్కో మొక్కను ఒక్కో ఉద్యోగి దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఈఓ వరలక్ష్మి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు వేణుగోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డెంగీ మరణాలు సంభవించకూడదు
జిల్లాలో డెంగీ వ్యాధితో ఒక్క మరణం కూడా సంభవించకూడదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. డెంగీ బారిన పడినవారికి తక్షణం మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మలేరియా నెల జూన్ అని చెప్పారు. రోజువారీగా క్యాలెండర్ సిద్ధం చేసి వివరాలు అందించాలన్నారు. చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆస్పత్రి, వైద్యారోగ్యశాఖ అధికారులు సమష్టిగా పనిచేసి మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పక్కాగా అమలు కావాలన్నారు. గతంలో డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో అధికారులు పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, ఆర్‌డీఎంఏ పీవీవీఎస్ మూర్తి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ పాల్‌రవి కుమార్, మలేరియా అధికారి ఓబుళు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంతరిస్తోన్న 'అలుగు'

- జీవ వైవిధ్యంలో విలువైన క్షీరదం
- పూర్తిగా కనుమరుగైతే రైతులకు నష్టం
- సంరక్షించాలని శాస్త్రవేత్తల పిలుపు



అలుగు

అనంతపురం: జీవ వైవిధ్య పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తూ, రైతులకు సాయం చేసే అరుదైన జీవ జాతికి చెందిన 'అలుగు' ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంతరించిపోతోంది. 10 సంవత్సరాల్లో ఈ జాతి సంతతి సుమారు 30 శాతం క్షీణించింది. శ్రీ సత్యసాయి జిల్లా కాళసముద్రం, కదిరి, బత్రేపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో చేపట్టిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది.

వింతైన ఆకారం..
అలుగు అనేది ఒక క్షీరదం. శాస్త్రీయ నామం మానిస్ క్రాసికౌడాటా. చీమలు, చెదపురుగుల పుట్టలను తవ్వి కీటకాలను తింటుంది. వీటి దవడలకు దంతాలు ఉండవు. పాశ్చాత్య దేశాల్లో స్కేలీ యాంటియేటర్ అని పిలుస్తారు. ప్రాంతీయంగా అలుగు అంటారు. అలుగు స్వరూపం చాలా వింతగా ఉంటుంది. చిన్నతల, గొట్టపు రూపం కలిగిన నోరు, చిన్నకళ్లు, చెవులు, చర్మంలో చీలికలు, బాహ్య చెవి డొప్ప తో కనిపిస్తాయి. ముఖం, ఉదర భాగం మినహాయించి దాని శరీరం పసుపు రంగు పొలుసులతో కప్పబడి ఉంటుంది. దీని ముక్కు మూసుకుపోయేలా చేసే కవాటాలతో పాటు పెద్ద నాసికా రంధ్రాలను కలిగి ఉంటుంది. నాలుక పొడవుగా, జిగటగా ఉంటుంది.

ఉపయోగాలెన్నో..
అలుగు క్రమేణా తగ్గిపోతుండడంతో జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతోంది. రైతు మిత్రగా పేరు సంపాదించుకున్న ఈ క్షీరద సంతతి తగ్గితే కీటకాలు పెరుగుతాయి. దీంతో ఆ ప్రభావం పంటల దిగుబడిపై పడి రైతులకు నష్టం జరుగుతుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. రైతులకు ప్రత్యక్షంగా ఎంతగానో ఉపయోగపడుతున్న అలుగు అంతరించకుండా చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

కారణాలివే..
ఎడారీకరణ, తక్కువ వర్షపాతం, అడవుల నరికివేత, ఆవాసాలు కోల్పోవడం, నేలకోత, భూమి క్షయం, వ్యవసాయ విస్తరణ, అతిగా జీవాల పెంపకం, పెరుగుతున్న పట్టణీకరణ, అడవుల్లో కార్చిచ్చు తదితర కారణాలతో అలుగు సంతతి తగ్గిపోతోంది.

అత్యధికంగా అక్రమ రవాణా



ప్రపంచంలోనే అత్యధికంగా అక్రమ రవాణా జరుగుతున్న క్షీరదం అలుగు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో వాటి పొలుసులు, తోలును బూట్లు, బ్యాగుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఆసియాలో కనిపించే నాలుగు జాతులు ఇండియన్ పాంగోలిన్ (మానిస్ క్రాసికౌడాటా), ఫిలిప్పైన్ పాంగోలిన్ (మానిస్ క్యులియోనెన్సిస్), సుండా పాంగోలిన్ (మానిస్ జవానికా), చైనీస్ పాంగోలిన్ (మానిస్ పెంటాడక్టిలా). అంతరించిపోతున్న జాతుల జాబితాలో అలుగును చేర్చారు. ఐయూసీఎన్ (అంతర్జాతీయ జీవ వైవిధ్య సంస్థ) రెడ్‌లిస్ట్‌లో చేర్చిన ఈ అలుగు పరిరక్షణకు నడుం బిగించాలి. గత 10 సంవత్సరాల్లో జిల్లాలో ఏకంగా 30 శాతం ఈ క్షీరద జాతి క్షీణించినట్లు పరిశోధనల్లో వెల్లడైంది.

– డాక్టర్ బాలసుబ్రమణ్యం, జువాలజీ టీచింగ్ అసిస్టెంట్, పరిశోధకులు, ఎస్కేయూ

ఈఏపీ సెట్‌లో రైతు బిడ్డకు రాష్ట్రస్థాయి నాల్గో ర్యాంకు


సతీష్‌రెడ్డి


కుషాల్‌కుమార్


సాయి హనీష్‌రెడ్డి


రాగూర్ రవీంద్రశ్రీ


సాయి తేజేష్


సాయిగౌతమ్


వెంకటసాయి చరణ్

- సత్తా చాటిన జిల్లా విద్యార్థులు


జస్వంత్ రెడ్డి


సాయికిరణ్


శ్రీనికేతన్


చక్రధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్/తాడిపత్రి అర్బన్/యాడికి: ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రైతుబిడ్డ పాలగిరి సతీష్ రెడ్డి రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు పాలగిరి కుమారి, లక్ష్మీరెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సతీష్ రెడ్డి 96.0330 మార్కులతో రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో దేశస్థాయి ఓపెన్ కేటగిరీలో 175వ ర్యాంకు సాధించాడు. భవిష్యత్తులో సివిల్స్‌లో సత్తా చాటి ప్రజాసేవ చేయాలన్నదే లక్ష్యమని విద్యార్థి తెలిపాడు.

అక్కడ 6వ ర్యాంకు, ఇక్కడ 8వ ర్యాంకు
అనంతపురం ఆర్కే నగర్‌కు చెందిన పుట్టి నాగేంద్ర, పుట్టి మణిమాల దంపతుల కుమారుడు కుషాల్ కుమార్ ఇటీవల విడుదలైన తెలంగాణ ఈఏపీసెట్‌లో 6వ ర్యాంకు సాధించాడు. ఏపీఈఏపీసెట్‌లో 94.3563 మార్కులతో 8వ ర్యాంకు సాధించాడు. అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో దేశస్థాయి ఓపెన్ కేటగిరీలో 5వ ర్యాంకు సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా కుషాల్ కుమార్ మాట్లాడుతూ ఐఐటీ ముంబైలో సీఎస్సీ కంప్యూటర్స్‌లో చేరతానన్నాడు.

- వీరితో పాటు పలువురు జిల్లా విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. తాడిపత్రి పట్టణం జయనగర్ కాలనీకి చెందిన కొండ్రెడ్డి కిషోర్‌రెడ్డి కుమారుడు సాయి హనీష్‌రెడ్డి రాష్ట్రస్థాయి 28వ ర్యాంకు సాధించాడు. అలాగే యాడికి మండల కేంద్రానికి చెందిన కొండారెడ్డి కుమారుడు జస్వంత్ రెడ్డి 61వ ర్యాంకు, కణేకల్లుకు చెందిన ఎండికట్ల శ్రీనివాసులు కుమారుడు రాగూర్ రవీంద్రశ్రీ 101 ర్యాంకు, అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన డి.పోతురాజు కుమారుడు సాయితేజేష్ 118వ ర్యాంకు, వేణుగోపాల్‌నగర్‌కుచెందిన గుంటకంటి శివప్రసాద్ కుమారుడు సాయి గౌతమ్ 125వ ర్యాంకు, తాడిపత్రి నవరంగ్ థియేటర్ వీధికి చెందిన రాచమడుగు వెంకట శ్రీనివాసులు కుమారుడు వెంకటసాయి చరణ్ 214వ ర్యాంకు, అనంతపురం సోమనాథ్‌నగర్‌కు చెందిన గోసకొండ భరద్వాజ్ కుమారుడు శశికిరణ్ 281వ ర్యాంకు, రామచంద్రనగర్‌కు చెందిన ప్రభందం సాయి విజయ రాఘవ కుమారుడు శ్రీనికేతన్ 345వ ర్యాంకు, తాడిపత్రి పట్టణం గురులాడ్జ్ వీధికి చెందిన సంగటి శ్రీనివాసరెడ్డి కుమారుడు చక్రధర్‌రెడ్డి 366వ ర్యాంకులతో ప్రతిభ చాటారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం


కళాశాలను పరిశీలిస్తున్న న్యాక్ బృందం

తాడిపత్రిటౌన్: స్థానిక ఆటోనగర్ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం న్యాక్ ప్రీవ్యూ కమిటీ సభ్యులు సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. కళాశాల పరిసరాలు, ల్యాబ్, మౌలిక సదుపాయలు తనిఖీ చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో న్యాక్ బృందం సభ్యులు విజయబాబు, కిరణ్, వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

పెనుకొండ రూరల్: రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు వాల్మీకుల అభ్యున్నతి కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2023, జులై 19న ఆ కార్పొరేషన్‌కు రాష్ట్ర చైర్మన్‌గా రామచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో కార్పొరేషన్‌ల కో ఆర్డినేటర్ పులివెందుల ప్రవీణ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన తన పదవికి రాజీనామా చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫర్టిలైజర్స్ దుకాణదారులను అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి హెచ్చరించారు. అనంతపురం రూరల్ ఏఓ శశికళతో కలసి పాతూరు ప్రాంతంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేపట్టారు. లైసెన్సులు, వివిధ రకాల డాక్యుమెంట్లు, స్టాకు, ధరల బోర్డుల ఏర్పాటు, రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వడం, సేల్స్ నిర్వహణ, నాసిరకం, కల్తీ, నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలు తదితర వాటిని పరిశీలించారు. పుడమి అగ్రిమార్ట్‌లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.2.80 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

14న జిల్లా జైలు ఆదాయ వనరుల వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైలులో ఆదాయ వనరులపై ఈ నెల 14న వేలం పాట నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రెహమాన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనే వారు రూ.22 వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. వేలం పాట ముగిసిన తర్వాత డిపాజిట్ సొమ్ము వెనక్కి చెల్లిస్తారు.

నిప్పు రాజేస్తున్నారు!

- బుగ్గవుతున్న డ్రిప్ పరికరాలు, పశుగ్రాసం
- మూడు వారాల్లోపు ఏడుగురు రైతులకు రూ.5.5 లక్షల నష్టం
- కునుకులేని కనుకూరు రైతులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు


రైతు కురుబ రామచంద్రకు చెందిన స్ప్రింక్లర్ పైపులు కాలిబూడిదవుతున్న దృశ్యం


కాలి బూడిదైన రైతు మహాదేవప్పకు చెందిన గుడిసె (ఫైల్)


రైతు కిష్టప్పకు చెందిన డ్రిప్ పరికరాలు కాల్చేసిన దృశ్యం (ఫైల్)

శెట్టూరు: ఎన్నికల ఫలితాల మాటేమో గానీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. ఎన్నికలు జరిగిన అనంతరం గెలుపోటములతో సంబంధం లేకుండా హింసాత్మక ఘటనలకు తావిస్తున్నారు. ఫలితాలు వెల్లడైన తర్వాత రెచ్చిపోయి ఆస్తుల విధ్వంసానికి తెరలేపారు. శెట్టూరు మండలంలోని కనుకూరులో కక్షతో నిప్పు రాజేయడంతో రూ.లక్షల విలువైన ఆస్తి నష్టాలను రైతులు మూట గట్టుకోవాల్సి వచ్చింది.

ఉద్దేశపూర్వకంగానే నిప్పు

కనుకూరుకు చెందని రైతు కురుబ రామచంద్రకు చెందిన 35 స్ప్రింక్లర్ పైప్‌లకు మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్ప్రింక్లర్, డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకుని తనకున్న ఐదు ఎకరాల్లో వేరుశనగ, టమాట సాగు చేస్తుంటారు. ఇటీవల పంట కాలం ముగియడంతో బిందు సేద్యం పరికరాలను తొలగించి పొలంలోనే చెట్టు కిందకు చేర్చాడు. ఖరీఫ్ సీజన్ కింద వేరుశనగ విత్తేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో స్ప్రింక్లర్ పైప్‌లు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనతో రూ.45 వేల మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. ఉద్దేశపూర్వకంగానే ఈ దురాగతానికి పాల్పడినట్లుగా రైతులు అనుమానిస్తున్నారు.

ఎవరు చేస్తున్నారు?

బిందు సేద్యం పరికరాలే కాదు... చివరకు పశుగ్రాసాన్ని సైతం దుండగులు వదిలిపెట్టడం లేదు. కనుకూరు గ్రామంలో ఈ మూడు వారాల్లోపు ఏడుగురు రైతులకు సంబంధించిన డ్రిప్, పశుగ్రాసానికి నిప్పు పెట్టారు. కక్షలకు మూగజీవాల నోటి కాడ కూడు సైతం కాలి బుగ్గవుతోంది. వేరుశన పొట్టు వాములకు రాత్రికి రాత్రే నిప్పు పెట్టేస్తున్నారు. దీంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇది ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? అనేది అర్థం కాక రైతులు తలలు బాదుకుంటున్నారు.

కొన్ని ఇలా...

- గత ఏప్రిల్ 24న రైతు కిష్టప్పకు సంబంధించి డ్రిప్ పరికరాలు 75 స్ప్రింక్లర్‌పైపులు, 25 గన్స్, రెండు ఎకరాలకు సరిపడే డ్రిప్ వైర్‌కు దుండగులు నిప్పు పెట్టారు. దీంతో రూ.1.5 లక్షల మేర సదరు రైతుకు నష్టం వాటిల్లింది. తిరిగి ఈ నెల 6న ఇదే రైతుకు చెందిన స్ప్రింక్లర్ పైప్‌లకు దుండగులు నిప్పు పెట్టారు. దీంతో రూ.25వేల నష్టం వాటిల్లింది.
- మే 21న కురుబ మహదేవప్పకు చెందిన గుడిసెకు నిప్పు పెట్టారు. ఇందులో రెండు ఎకరాలకు సరిపడ డ్రిప్ వైరు, ఐదు గన్నులు ఉన్నాయి. ఈ ఘటనతో సదరు రైతుకు రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది.
- మే 22న ఉప్పర వెంకటేష్‌కు చెందిన రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో బాధిత రైతుకు రూ.50 వేలు మేర నష్టం వాటిల్లింది.
- ఈ నెల 2న గొల్ల నాగమ్మకు చెందిన గొర్రెల దొడ్డికి నిప్పు పెట్టడంతో రూ.50 వేల మేర నష్టం వాటిల్లింది.
- ఈ నెల 5న రైతు మంజునాథకు చెందిన స్ప్రింకర్ల పైపులకు నిప్పు పెట్టారు. దీంతో రూ.15 వేలు నష్టపోయాడు.
- తాజాగా 12న కురుబ రామచంద్రకు చెందిన బిందు సేద్యం పరికరాలకు నిప్పు పెట్టడంతో రూ.45 వేలు నష్టం వాటిల్లింది.

స్పందించని పోలీసులు

కనుకూరులో చోటు చేసుకున్న వరుస ఘటనలపై ఫిర్యాదు చేసిన పోలీసులు స్పందించడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. గ్రామంలో మొదటి సారి చోటు చేసుకున్న ఘటనపై శెట్టూరు పోలీసులకు అప్పట్లోనే బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన పోలీసులు ఎలాంటి వివరాలు రాబట్టుకుండానే కాలి బూడిదైన పరికరాలను చూసి వెళ్లిపోయారు. ఈ ఘటన తర్వాత వరుసగా రోజుల వ్యవధిలోనే మరి కొన్ని ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆయా ఘటనలపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు కానీ, దుండగులు ఎవరైంది ఇప్పటికీ నిర్ధారణ కాలేదు.

విద్యార్థులకు ఎలాంటి సమస్యలూ తలెత్తరాదు

- బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి


వార్డెన్లతో మాట్లాడుతున్న కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: వేసవి సెలవుల అనంతరం వసతి గృహాలు త్వరలో పునఃప్రారంభమవుతున్నాయని, ఇలాంటి తరుణంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని వార్డెన్లను బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి ఆదేశించారు. జిల్లాలోని బీసీ వసతి గృహాల వార్డెన్లతో మంగళవారం అనంతపురంలో ఆమె సమావేశమై మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగు పరచాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యే నాటికి వసతి గృహాల పరిసరాలు, గదులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహాల పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. హాస్టళ్ల ప్రారంభంపై ప్రతి విద్యార్థికి ముందుగానే సమాచారం అందించాలన్నారు. వార్డెన్లు స్థానికంగా ఉంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

కూడేరు: మండలంలోని కొర్రకోడు గ్రామ పొలాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం పొలాల్లో సంచరిస్తున్న యువకులను గుర్తించిన రైతులు మోటార్లకు అమర్చిన విద్యుత్ కేబుల్ అపహరించుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారని సీఐ శివరాముడు తెలిపారు.

ఎంసీఏ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఈ ఏడాది మేలో నిర్వహించిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్-20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల య్యాయి. మొత్తం 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వెల్లడించారు. తక్కువ సమయంలోనే ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, విభాగాధిపతులు డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ ఎం. రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణి రాధ, అజిత పాల్గొన్నారు.

నగదు అపహరణ

తాడిపత్రి అర్బన్: వ్యక్తిగత పనులపై పట్టణానికి వచ్చిన ఓ వ్యక్తి నుంచి రూ.60 వేల నగదును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు తన తల్లికి సంబంధించిన పెన్షన్ డబ్బును బ్యాంకులో డ్రా చేసుకునేందుకు మంగళవారం ఉదయం తాడిపత్రికి వచ్చాడు. బ్యాంకులో నగదు డ్రా చేసుకున్న అనంతరం సీబీ రోడ్డులోని ఓ చెప్పుల దుకాణంలోకి వెళ్లి నగదు బ్యాగ్‌ను పక్కనే ఉంచుకుని చెప్పుల కొనుగోలు చేశాడు. అనంతరం బ్యాగ్ కోసం చూడగా కనిపించలేదు. అలాగే తన ద్విచక్ర వాహనం ప్లగ్‌ను కూడా దుండగులు తొలగించినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడంతో అర్బన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాల్యం జేఎల్‌ఎంకు గుండెపోటు

- అధికారుల ఒత్తిళ్లే కారణం
- ఒక రోజు డ్యూటీకి హాజరు కాలేదంటూ జీతంలో రూ.16వేల కోత


జిలాన్

కణేకల్లు: ఒక్కరోజు డ్యూటీకి హాజరు కాలేదన్న నెపంతో జీతంలో రూ.16 వేలు కోత పెట్టడంతో తీవ్ర మనోవేదనకు లోనైన ట్రాన్స్‌కో ఉద్యోగి గుండెపోటుకు గురై, ఆస్పత్రిలో చేరాడు. వివరాలు... కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాల్యం గ్రామ సచివాలయంలో గ్రేడ్-2 జేఎల్ఎంగా జిలాన్ పనిచేస్తున్నాడు. పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అయితే తుంబిగనూరు, నాగేపల్లి గ్రామాలకు లైన్‌మెన్ లేకపోవడంతో వాటి బాధ్యతలనూ ఆయనకు అధికారులు అప్పగించారు. ఈ క్రమంలో మూడు గ్రామాల్లో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్నన చూరగొన్నాడు. ఈ నెల 23న పెళ్లి నిశ్చయం కావడంతో పెళ్లి పనులపై గత నెలలో ఉన్నతాధికారుల అనుమతితో ఒక రోజు సెలవుపై వెళ్లాడు. ఆ మరుసటి రోజు అనుకోని కారణాలతో విధులకు హాజరు కాలేకపోయాడు. దీంతో ఆ రోజు కూడా తనకు సెలవు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరినా ఫలితం లేకపోయింది. అంతటితో ఆగకుండా జీతం రూ.27,500 నుంచి రూ.16 వేలు కోత పెట్టి మిగులు సొమ్మును ఈ నెలలో అధికారులు అందజేశారు. సోమవారం విధులు ముగించుకుని కణేకల్లులోని తన గదికి చేరుకున్న ఆయన ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలాడు. గమనించిన స్నేహితులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండె పోటుకు గురైనట్లు నిర్ధారించి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆయన అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పనిభారానికి తోడు బకాయిల వసూళ్లపై టార్గెట్‌లు పెట్టి అధికారులు హింసించడమే కాక, సెలవు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జీతంలో ఏకంగా రూ.16వేలు కోత పెట్టడం ఎంత వరకు సబబు అంటూ కుటుంబసభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

జీజీహెచ్‌లో చిన్నపిల్లల సర్జరీలు ప్రారంభం


ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల ఓపీ విభాగం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్న పిల్లల సర్జరీ విభాగం అందుబాటులోకి వచ్చింది. రెండు నెలలుగా ఆస్పత్రిలోని ఈ విభాగం ద్వారా చిన్నారులకు కేవలం వైద్య సేవలు మాత్రమే అందేవి. ఇకపై వారంలో బుధ, శుక్రవారాల్లో ఓపీ సేవలుంటాయి. మిగిలిన రోజుల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు, వారంలో ఒక రోజు శస్త్రచికిత్సలు చేసేలా సంబంధిత వైద్యులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే ఈ విభాగానికి ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులో డాక్టర్ చలపతి నియమించారు. ఈయనతో పాటు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లున్నారు. గతంలో పీడియాట్రిక్ సర్జరీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ విభాగాన్ని ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. నవజాత శిశువుల్లో అన్నవాహిక సమస్య, ప్రసవ సమయంలో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు ఛాతిలోకి పేగుల వెళ్లడం, కిడ్నీ వాపు, హెర్నియా తదితర అత్యవసర శస్త్రచికిత్సలను అందజేయనున్నారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారుల కోసం ఫిమేల్ సర్జికల్ వార్డులో ఐదు మంచాలను ఏర్పాటు చేశారు. సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన పీడియాట్రిక్ సర్జరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- మూడు నెలల క్రితం ఢీకొన్న ద్విచక్ర వాహనం
- అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స
- పరిస్థితి విషమించి మంగళవారం మృతి


గాయపడిన రామ్ చరణ్(ఫైల్)

రాయదుర్గం రూరల్: మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ బాలుడు... ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామానికి చెందిన సోమరాజు, ఇందిరమ్మ దంపతుల కుమారుడు రామచరణ్ (15) ఈ ఏడాది మార్చిలో అదే గ్రామంలో రోడ్డు దాటుతుండగా కెంచానపల్లికి చెందిన వన్నూరుస్వామి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న రామచరణ్‌ను కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం బళ్లారిలోని విమ్స్‌కు అక్కడి నుంచి బెంగళూరులోని ఇందిరాగాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న రామచరణ్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ జీడీ వెంకటరమణ తెలిపారు.

సమష్టిగా పనిచేద్దాం : ఎస్పీ


వెల్ఫేర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి సమష్టిగా పని చేద్దామని ఎస్పీ గౌతమిశాలి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె పోలీసు అధికారులతో కలసి కాన్ఫరెన్స్ హాల్‌లో వెల్ఫేర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఆరోగ్యం, విద్య, విధులు, తదితర అంశాలపై చేపట్టాల్సిన సంక్షేమ చర్యలను అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. పోలీసు పెట్రోల్ బంకు, జిమ్, నర్సరీ, సీపీసీ క్యాంటీన్, మహిళా బ్యారక్, కోదండ రామాలయం, కల్యాణమంటపం, దర్గా, షాదీ ఖానా, చర్చి, ఇండోర్ స్టేడియం, పోలీసు కాంప్లెక్స్‌లోని డార్మెటరీ, కన్వెన్షన్ హాల్‌ను సందర్శించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, మధు, జిల్లా పోలీసు కార్యాలయం పాలనాధికారి శంకర్, కార్యాలయ బీ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తలపై చెట్టు కొమ్మ పడి వృద్ధుడి మృతి


మృతుడు రామలింగ

ఉరవకొండ: చెట్టు కొమ్మ విరిగి తలపై పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం పెద్దకొఉంట్లకు చెందిన రామలింగ (70)కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న రామలింగ మంగళవారం ఉదయం గ్రామంలోని రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసిన కొళాయి వద్దకు నీరు తాగేందుకు వెళ్లాడు. అప్పటికే గాలి, వాన ప్రారంభం కావడంతో కట్ట మీద కూర్చొన్న ఒక్కొక్కరూ ఇంటి దారి పట్టారు. అదే సమయంలో బలమైన గాలి వీచడంతో కట్ట సమీపంలోని వేప చెట్టుకు ఉన్న పెద్ద కొమ్మ విరిగి రామలింగ తలపై పడింది. తీవ్రమైన రక్తగాయమైన రామలింగను స్థానికులు 108 అంబులెన్స్ వాహనం ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వైఎస్సార్ విగ్రహంపై రాళ్లు, రాడ్లతో దాడి

పెద్దపప్పూరు: మండలంలోని వరదాయపల్లిలో టీడీపీ కార్యకర్తలు దుశ్చర్యకు పాల్పడ్డారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై మంగళవారం సాయంత్రం రాడ్లు, రాళ్లతో దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి డీఎస్పీ జనార్దన నాయుడు, యాడికి సీఐ రోషన్, పెద్దపప్పూరు పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకోవడంతో టీడీపీ కార్యకర్తలు పరారయ్యారు. దాడిలో విగ్రహం పాక్షికంగా దెబ్బతిన్నట్లు పోలీసులు గుర్తించారు. విధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

స్థల వివాదంతోనే సంపత్ హత్య

- ఎన్ఎస్‌యూఐ నేత సంపత్‌కుమార్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురి అరెస్టు... నగదు, కత్తులు స్వాధీనం
- కర్ణాటకలో హత్య చేసి ధర్మవరం చెరువు వద్ద మృతదేహం పడేసిన వైనం
- రూ.55 లక్షలకు సుపారీ... రూ.15 లక్షలు నిందితులకు అందజేత


స్వాధీనం చేసుకున్న నగదు, మారణాయుధాలు చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ఓ స్థలం విషయంలో నెలకొన్న వివాదంతోనే ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్యకు గురైనట్లు పోలీసులు తేల్చారు. వివరాలను మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం విలేకరులకు వెల్లడించారు. హిందూపురంలోని న్యాయవాది కృష్ణారెడ్డి ఇంటి ఎదుట ఓ ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం విషయంలో న్యాయవాది కృష్ణారెడ్డి హిందూపురానికే చెందిన శ్రీకాంత్‌రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి. ఈక్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తన స్నేహితుడైన ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్‌కుమార్‌ను సాయం కోరాడు. దీంతో స్థల వివాదంలో జోక్యం చేసుకున్న సంపత్‌కుమార్ పలుమార్లు న్యాయవాది కృష్ణారెడ్డితో గొడవ పడ్డాడు. ఇరువురూ పోలీసుస్టేషన్‌లో పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు.

అడ్డు తొలగించుకోవాలని...

శ్రీకాంత్‌రెడ్డితో పెద్దగా ఇబ్బంది లేకున్నా...అతని స్నేహితుడైన సంపత్‌కుమార్ తమను ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయవాది కృష్ణారెడ్డి భావించాడు. ఈ క్రమంలోనే సంపత్‌కుమార్‌ను అడ్డుతొలగించాలని భావించాడు. ఇందుకోసం ముదిరెడ్డిపల్లికి చెందిన సెటిల్‌మెంట్ రామాంజిని సంప్రదించాడు. దీంతో రామాంజి తన అనుచరులు ధర్మవరం సిద్దయ్యగుట్టకు చెందిన రంగం రవీంద్ర (ప్రస్తుతం హిందూపురంలో నివాసం), హిందూపురానికే చెందిన భుమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసులునాయుడులతో కలిసి మే 26వ తేదీన న్యాయవాది కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జునరెడ్డి సెటిల్‌మెంట్ రామాంజితో మాట్లాడి సంపత్‌కుమార్‌ను హత్య చేయాలని కోరారు. ఇందుకు రూ.55 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. అడ్వాన్స్‌గా సెటిల్‌మెంట్ రామాంజికి రూ.5 లక్షలు ఇచ్చారు.

బీర్లు తాగేందుకు వెళ్దామని చెప్పి...

ఎన్నికల నేపథ్యంలో కేరళ వెళ్లిన సంపత్‌కుమార్ మే 28న హిందూపురం వచ్చాడు. విషయం తెలుసుకున్న సెటిల్‌మెంట్ రామాంజి వెంటనే సంపత్‌కుమార్ హత్యకు పథకం వేశాడు. ఈ క్రమంలోనే గత నెల 29న కదిరికి వెళ్తున్నానని, కారు ఇవ్వాలని తన స్నేహితుడితో తీసుకున్నాడు. అనంతరం శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లతో కలిసి సంపత్‌కుమార్ కోసం హిందూపురంలో కాపు కాశారు. రాత్రి 10 గంటల సమయంలో నడుచుకుంటూ వస్తున్న సంపత్‌కుమార్‌తో రామాంజి గ్యాంగ్ మాట కలిపింది. గ్యాంగ్‌లోని శ్రీకాంత్‌కు అంతకు ముందే సంపత్‌కుమార్‌తో పరిచయం ఉండటంతో అతను కూడా వారితో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ క్రమంలోనే బీర్లు తాగేందుకు కర్ణాటకకు వెళ్దామని వారంతా కోరగా సంపత్‌కుమార్ అంగీకరించాడు. దీంతో అందరూ కలిసి కారులో కర్ణాటక రాష్ట్రం చింతలపల్లికి పోయే తారురోడ్డు పక్కన ఉన్న కాలువ దగ్గరకు వెళ్లారు. అక్కడ బీర్లు తాగారు. అదే సమయంలో మత్తులో ఉన్న సంపత్‌కుమార్‌ను ఖాళీ బీరు సీసాలు పగులగొట్టి పొడిచారు. అనంతరం వెంట తీసుకెళ్లిన బాకులు, కత్తులు, కొడవళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం సంపత్‌కుమార్ మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ధర్మవరం చెరువు రెండో మరువ వద్దకు వచ్చి కంపచెట్లలో పడేసి వెళ్లిపోయారు. మే 30న ఉదయం న్యాయవాది కృష్ణారెడ్డి క్లర్క్ నరేంద్ర అనంతపురంలో రామాంజి గ్యాంగ్‌కు మరో రూ.10 లక్షలు నగదు అందించాడు. దీంతో వారు అనంతపురంలోనే కారు వదిలేసి పరారయ్యారు. సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యతో సంబంధం ఉన్న సెటిల్‌మెంట్ రామాంజి, అతని అనుచరులు శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌ను మంగళవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7 లక్షలతో పాటు హత్యకు ఉపయోగించిన కత్తులు, కొడవళ్లు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులను త్వరలో అరెస్టు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసును ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం, హిందూపురం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

కానరాని కాడెడ్ల వ్యవసాయం

- యంత్రాల ద్వారానే సేద్యం
- పనులు లేక వ్యవసాయ కూలీలు ఇతర పనులకు

చెన్నేకొత్తపల్లి: కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పనులన్నీ కేవలం ఎద్దులతో మాత్రమే చేసేవారు. రానురాను సాంకేతికత పెరిగిపోవడంతో ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. గతంతో ముందస్తు వర్షాలు కురిస్తే పొలాలను ఎడ్లతో దుక్కిదున్ని పంటను సాగు చేసేందుకు అనువుగా చేసుకొనేవారు. గ్రామాల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు వేరుశనగ కాయల నుంచి విత్తనాలను వేరుచేసే పనులలో నిమగ్నమయ్యేవారు. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో యంత్రాలు వచ్చాయి. గతంలో విత్తనాలను సాగు చేయడం, పంటలో కలుపు మొక్కలను తొలగించడం, మందులను పిచికారీ చేయడం, పంటను తొలగించే పనులు కేవలం మనుషుల ద్వారానే చేసేవారు. ఇప్పుడు విత్తనం సాగు చేయడం నుంచి కలుపు తొలగించడం, మందులు పిచికారీ చేయడం పంటను తొలగించేందుకు అనేక రకాల పరికరాను ట్రాక్టర్లకు అమర్చుకొని మనుషులతో ప్రమేయం లేకుండా ఒకరిద్దరితోనే చేసుకుంటున్నారు.

తగ్గిన సేంద్రియ ఎరువులు

కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో వ్యవసాయం చేసే రైతుల ఇళ్ళ ముందు వ్యవసాయం చేసేందుకు ఎద్లను, పాడి సంపద కోసం పాడి పశువులను పెంచి పోషించుకొనేవారు. వాటి ద్వారా వచ్చే పేడ, గోమూత్రంను ఎరువులుగా మార్చుకొని పంట పొలాలకు వాడే వారు. వీటిదారి పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండే వారు. నేడు విత్తనాలను నిల్వ చేసుకొనడం నుంచి పంటను సాగు చేసి పంట ఇంటికి చేరే వరకు అనేక రకాల రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ప్రస్తుతం పశువుల ద్వారా వ్యవసాయం చేసేవారు కనుమరుగయ్యారు. మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయానికి వాడే పశువులు లేక పోగా యంత్రాల ద్వారానే పంటలను సాగు చేసుకుంటున్నారు. రసాయన ఎరువుల ద్వారా పండించి పంటలను తింటున్న ప్రజలు రకరకాల వింత రోగాల బారిన పడుతున్నారు. నేడు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది.


ట్రాక్టర్‌తో పొలం దుక్కి చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

బర్న్స్ వార్డులో సర్జరీ యూనిట్


సర్జరీ 6వ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న బర్న్స్ వార్డు ఇదే

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామినాయక్ విజ్ఞప్తి మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన బర్న్స్ వార్డులో సర్జరీ 6వ యూనిట్‌ను తరలించేందుకు ఆస్పత్రి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా మంగళవారం జీజీహెచ్‌లో ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలతను సర్జరీ వైద్యులు కలిశారు. 6వ యూనిట్‌లో 30 పడకలు అందుబాటులో ఉన్నాయని, యూనిట్‌కు మార్చుకోవచ్చని వారు సర్జరీ వైద్యులకు తెలియజేశారు. బర్న్స్ వార్డులో విశాలమైన గదులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

పంపనూరులో నేడు కల్యాణోత్సవం

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శుద్ధ షష్టి సందర్భంగా శ్రీవల్లి, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అలయ అర్చకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కల్యాణోత్సవంలో పాల్గొనే వారు రూ.600 చెల్లించిసంప్రదాయ దుస్తులు ధరించాలని రావాలని సూచించారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


వడల అలంకారంలో అభయాంజనేయుడు

అనంతపురం కల్చరల్: స్థానిక హౌసింగుబోర్డులో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయం ప్రతిధ్వనించింది. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం శ్రీగంధ లేపనంతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేక సేవలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిలువెత్తు అభయాంజనేయస్వామికి 5 వేల వడలతో అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు.వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాలందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పరుచూరు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అరుదైన విగ్రహాలలో ఒకటిగా పేరుగాంచిన అభయాంజనేయ స్వామి ప్రతిష్ట జరిగి 9 ఏళ్ల ముగియడంతో ప్రత్యేక వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం హనుమాన్ చాలీసా ముగింపు వేడుకలు భక్తుల జయ్ శ్రీరామ్ నినాదాల నడుమ మహామంగళహారతితో ఘనంగా జరిగాయి.

14 నుంచి లేపాక్షి హస్తకళల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: హస్తకళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లేపాక్షి ఎంపోరియంలో ఐదు రోజుల పాటూ హస్తకళా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో జరిగిన సమావేశంలో ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు వివరాలనందించారు. సంప్రదాయ చేనేత వస్తువుల అమ్మకాలు ప్రదర్శన, మన సంస్కృతిని చాటే కళా ఉత్పత్తులను డిస్కౌంటు ధరలకే విక్రయాలుంటాయని తెలిపారు. 14 నుంచి 18 వరకు అనంత వేదికగా అద్భుత నైపుణ్యంతో సాగే హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపోరియం సిబ్బంది కాటమయ్య, అమరనాథ్, సురేష్, నాగార్జున, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం


చదువు చెప్పిన నాటి టీచర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: కణేకల్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌లో 1996-97 పదో తరగతి బ్యాచ్ చదివిన పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను మంగళవారం అనంతపురంలో సన్మానించారు. గురువు శ్రీనివాస్ చౌదరిని వాల్మీకి కల్యాణమండపంలో, మరో గురువు సుధాకర్ రెడ్డిని గుల్జార్‌పేటలోని ఆయేన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ గురువులను కలిసినందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉలవల నాగరాజు, ప్రసాద్, నాగభూషణ, అంజినప్ప, రామాంజినేయులు, మల్లేష్, గోపాల్, మురళి, చిరంజీవి, చక్రవర్తి, శేఖర్, సంపత్, రాజు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నేకొత్తపల్లి: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆశావర్కర్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యలు వివరించాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అప్రమతంగా ఉండాలన్నారు. గర్భిణులకు అందుబాటులో ఉండి వారికి డాక్టర్ సలహాలను తెలియజేస్తూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు.

కనగానపల్లి: కలుషిత ఆహారాన్ని తినటం వల్లనే అతిసారం ప్రబలుతుందని కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలం ఆరంభంలో ప్రబలే అతిసారం నివారణ చర్యలపై ఆశా వర్కర్లకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవటంతో పాటు రోగులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందజేయాలన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రవినాయక్

బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి విజయ్‌కుమార్


కత్తి విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డ్యాన్స్‌మాస్టర్లు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిత్రకారుడిగా, డ్యాన్సర్‌గా, కరాటే మాస్టర్‌గా, కళా ఉత్పత్తుల సృజనకారునిగా, నటదర్శకునిగా రాణిస్తున్న కత్తి విజయ్‌కుమార్ బహుముఖ ప్రజ్ఞ శాలి అని వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక ఎల్కేపీ వేదికగా రాకింగ్ డ్యాన్స్ అకాడమీ వేసవి శిక్షణా ముగింపు వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన కత్తి విజయ్‌కుమార్‌ను అనంత డ్యాన్స్ మాస్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు కత్తి విజయ్‌కుమార్ సేవలను ప్రశంసించారు.

అనంతరం డ్యాన్‌మాస్టర్ చందూ శిష్యబృందం ప్రదర్శించిన నాట్యవిన్యాసాలు ఆకట్టుకున్నాయి. టీవీ, సినీనటుడు రమేష్‌నీల్ యాంకరింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలనందించారు. ఆత్మీయ అతిథులుగా మధు రాయల్, జయప్రకాష్, డాక్టర్ రష్మి, పలువురు డాన్సుమాస్టర్లు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం 38వ డివిజన్‌లోని పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను మేయర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్కులలో వసతులను పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే పార్కులలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, పచ్చదనం పెంపు, నూతన జిమ్ పరికరాలు ఏర్పాటు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటడంతో పాటు మొక్కలు సంరక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటుగా ఇప్పటికే 21, 37, 50 తదితర డివిజన్లలోని పార్కుల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్‌చంద్ర బోస్, వైఎస్సార్‌సీపీ నేత శీన తదితరులు పాల్గొన్నారు.


పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలు పాటించకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యనమల నరేష్, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, పీఎస్‌ఐవీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు ఏర్పాటు చేశాయన్నారు. పాఠశాల పేర్లతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నా తుంగలో తొక్కుతూ తరగతికి రూ. 11 వేల నుంచి 15 వేల వరకు వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. రెండు మూడు బ్రాంచ్‌లకు పర్మిషన్ తెచ్చుకొని 7-8 బ్రాంచ్‌లు నడుపుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఓబులేష్ మంజు ఉమామహేష్, వంశీ హరికృష్ణ, విశ్వనాథ్, హర్ష, రారాజు, విశ్వనాథ్, ఆనంద్, పవన్, కార్తిక్, హుసేన్, అరుణ్, తరుణ్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నడిమివంకను సర్వే చేయండి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: నడిమివంకను పూర్తిస్థాయిలో సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ నడిమివంకను పరిశీలించారు. వంకకు ఆనుకుని ఉన్న సోమనాథ్ నగర్, 5, 6వ రోడ్లు, గౌరవ్‌గార్డెన్ ప్రాంతాల్లో వరదలు ఏవిధంగా వచ్చాయని కమిషనర్ మేఘస్వరూప్‌ను కలెక్టర్ ఆరా తీశారు. గౌరవ్‌గార్డెన్ ఎక్స్‌టెన్షన్ వద్ద వంక వెడల్పు తగ్గి ఉండడాన్ని చూసిన కలెక్టర్..వంక ప్రారంభ దశ నుంచి వెడల్పుగా ఉందని, ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో చిన్నగా ఉందని నిర్ధారణకు వచ్చారు. సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం రోడ్డు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డు, కళారామం పార్క్‌లో గతేడాది చేపట్టిన మొక్కల పెంపకాన్ని కలెక్టర్ పరిశీలించారు. నగరంలో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కలెక్టర్ వెంట కమిషనర్ మేఘ స్వరూప్, హార్టికల్చర్ ఏడీ లక్ష్మిప్రసన్న, తహశిల్దార్ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నడిమివంకను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

సబ్సిడీ కందులపై రైతుల ఆసక్తి

కూడేరు: సబ్సిడీ కందుల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు ఎల్‌ఆర్‌జీ-52 రకం కందులను 50 క్వింటాళ్లు అధికారులు కేటాయించారు. సబ్సిడీ పోను 4 కేజీల కందుల ప్యాకెట్ ధర రూ.392గా నిర్ణయించారు. 37 మంది రైతులు కందుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా వారికి 7 క్వింటాళ్ల మేర పంపిణీ చేసినట్లు ఏఈఓ శైలజ మంగళవారం తెలిపారు. అలాగే విత్తన వేరుశనగ కోసం 2,869 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 2,500 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా విత్తన వేరుశనగ గానీ, కందులు గానీ కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.


కందుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి బోనాలు


బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

ఆత్మకూరు: ఆత్మకూరు పోలిమేర పెద్దమ్మ తల్లికి మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరులోని వడ్డెర కులస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాల ఎత్తుకొని ఉరుములతో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట పదుల సంఖ్యలో పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


అలంకరణలో పెద్దమ్మ తల్లి

మీ సేవలు చిరస్మరణీయం


ఉద్యోగ విరమణ పొంది సన్మానం అందుకున్న సిబ్బందితో ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం: సుదీర్ఘ కాలం పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్న మీ సేవలను పోలీసు శాఖ ఎన్నటికీ మరువజాలదని ఎస్పీ గౌతమిశాలి కొనియాడారు. ఇటీవల 9 మంది ఉద్యోగ విరమణ పొందగా... వీరిలో ఏడుగురిని మంగళవారం ఎస్పీ ఘనంగా సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో ఎస్ఐ వెంకట చలపతి, ఏఎస్ఐలు నాగరాజు, సయ్యద్ ఇబ్రహీం, జనార్ధన్, ఏఆర్ ఎస్ఐలు ఖాదర్‌బాషా, శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ గౌస్ పీరా ఉన్నారు. శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, మధు, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, జాఫర్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాట సుంకులమ్మ జాతర

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో మంగళవారం జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచి అభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు 20వ వార్డు పైతోటలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని ఓ ఆవు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. రాయదుర్గం మండలం వీరాపురానికి చెందిన మహేష్, సన్న ద్విచక్ర వాహనంపై కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి గ్రామానికి వస్తుండగా పైతోట వద్ద ఆవును ఢీకొన్నారు. ఆవు అక్కడిక్కడే మృతి చెందగా వారిద్దరికీ తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. ఆవు మృతితో రూ.30 వేలు నష్టం వాటిల్లిందని పైతోటకు చెందిన లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా మహాలక్ష్మి రథోత్సవం



బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురం గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం మంగళవారం సాయంత్రం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గంగా జలంతో అమ్మవారిని అభిషేకించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 101 మంది గొరవయ్యల నృత్యం, నంది కొలు, వీరభద్ర కుణిత, మహిళా విరకాశి నాట్యాల మధ్య రథోత్సవం నిర్వహించారు. ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్ ఎస్ఐలు శ్రీనివాసులు, గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యే 'అనంత'


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యేలు అధినేతను కలిశారు.

12 కేజీల ప్లాస్టిక్ సీజ్


రాజు రోడ్డులో మహావీర్ ప్లాస్టిక్స్ షాపులో తనిఖీ చేస్తున్న ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ప్లాస్టిక్ నియంత్రణపై కమిషనర్ మేఘ స్వరూప్ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్యాధికారి(ఎంహెచ్‌ఓ) డాక్టర్ విష్ణుమూర్తి బృందం మంగళవారం నగరంలోని రాజు రోడ్డులో మూడు షాపులను ఆకస్మిక తనిఖీ చేసి, ఆ షాపుల్లో ఉన్న 12 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీజ్ చేశారు. స్వగృహ ఫుడ్స్‌కు రూ.5 వేలు, మహావీర్ ప్లాస్టిక్ షాపు నిర్వాహకులకు రూ.5 వేలు, మహాలక్ష్మి ప్లాస్టిక్ షాపునకు రూ.3 వేలు జరిమానా విధించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్లాస్టిక్‌ను వినియోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇబ్బంది కల్గించే ప్లాస్టిక్‌ను వాడకూడదని తెలిపారు. జరిమానా విధించిన షాపులు మరోసారి ప్లాస్టిక్‌ను విక్రయించినా, తినుబండారాలను అందులో ఉంచి ప్రజలకు చేరవేసినా చర్యలు తప్పవన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, పారిశుద్ధ్య కార్యదర్శులు శ్రీహర్ష, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా


ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: పి.యాలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. తనతోపాటు సొసైటీ డైరెక్టర్లు నారాయణస్వామి (మల్లన్న), నారపరెడ్డి రాజీనామా చేసినట్లు ఆయన తెలియజేశారు. తమ హయాంలో రైతులకు విరివిగా రుణాలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. శక్తివంచలేకుండా రైతుల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు.